క్లుప్తంగా

ముమ్మర తనిఖీలు



కోసూరు(మొవ్వ): సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగే అల్లర్లు, గొడవల దృష్ట్యా మొవ్వ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఒకటైన కోసూరులో మంగళవారం రాత్రి పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పామర్రు సర్కిల్ పరిధిలోని సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీఐ మాట్లాడుతూ పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఐక్యవేదిక సభ్యత్వ నమోదు ప్రారంభం

మండవల్లి: ఏపీ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ప్రారంభించినట్లు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు తెలిపారు. రెండు రోజుల్లో 30 మంది సభ్యులు సభ్యత్వం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు సంవత్సరాలకు రూ.100 రుసుంతో సభ్యత్వాన్ని పొందవచ్చని తెలిపారు. సమష్టి కృషి ద్వారా మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

వేగవంతంగా ఉపాధి హామీ పనులు



మండవల్లి: మండలంలోని 26 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మండలంలోని మండవల్లి, లింగాల, పెరికెగూడెం, కానుకొల్లు తదితర గ్రామాల్లో పంట కాలువ మరమ్మతు పనులు, పంట బోదెల్లో తవ్వకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తం 3,800 మంది బుధవారం నిర్వహించిన పనుల్లో పాల్గొన్నట్లు ఎంటీఏ నవీన్ తెలిపారు. దెయ్యంపాడులో పంట కాలువ పనులను 102 మంది కూలీలతో చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీసోమేశ్వరస్వామి ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శ్రీపార్వతీసమేత స్వామివారిని పెండ్లికుమార్తె, పెండ్లికుమారుడిగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ద్వితీయ కల్యాణోత్సవం గురువారం రాత్రి వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించి ముగింపు రోజు శుక్రవారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

గ్రామీణ మహిళల ఉపాధికి ఉచిత శిక్షణ

సీడాప్ ఆధ్వర్యంలో ఉచిత హాస్టల్, భోజనం

కైకలూరు: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు జూన్ మొదటి వారం నుంచి ఉద్యోగ కల్పన నిమిత్తం ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్థానిక కో-ఆర్డినేటర్ ఎం.గణపతి బుధవారం తెలిపారు. ఇంటర్ నుంచి డిగ్రీ, ఐటీఐ చదివిన యువతులు ఉచిత కోర్సులకు అర్హులన్నారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 26 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన యువతులు 5 పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, వైట్ రేషన్ కార్డు అందించాలన్నారు. ఏలూరు సత్రంపాడులో శిక్షణ ఉంటుందన్నారు. యువతులకు ఉచిత హాస్టల్, భోజనం, డిజిటల్ తరగతి గదులు, ప్రతి ఒక్కరికీ మినీ కంప్యూటర్ వాడుకునే సౌకర్యం, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం, విశాలవంతమైన కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉందన్నారు. అందరికీ యూనిఫాం, మెటీరియల్ అందిస్తారని పేర్కొన్నారు. కంప్యూటర్ కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్స్ మేనేజ్మెంట్ కోర్సులు నేర్పుతారని తెలిపారు. కైకలూరు పరిసర మండల ప్రాంతాల్లో ఆసక్తి కలిగిన యువతులు 92476 30162లో సంప్రదించాలని కోరారు.

ఆలోచనలకు భౌతికరూపం చిత్ర లేఖనం



జమీగొల్వేపల్లిలో వేసిన చిత్రలేఖనాలను చూపుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): చిత్రలేఖనం అనేది మస్తిష్కంలోని ఆలోచనలకు భౌతిక రూపమని సహజత్వం ప్రతిభింబించే విధంగా చిత్రలేఖనం ఉండాలని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వేసవి శిక్షణలో భాగంగా చిత్రలేఖనంపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో దేనినైనా ఆవిష్కరించగల గొప్ప కళ చిత్రలేఖనం అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరాల్లో పంచతంత్ర కథలు, నీతి కథలు, వేమన, సుమతీ శతక పద్యాలు తదితరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీవి వంశీకృష్ణ, గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం బాలికలకు స్కిప్పింగ్, ఆటల పోటీలను నిర్వహించామని లైబ్రేరియన్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పి.శాంతి బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఆటలు, నీతికథలు, చిత్రలేఖనం వంటి శిక్షణ ఇక్కడ ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ ముగింపులో భాగంగా చిన్నారులకు అన్ని విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలకు సంబంధించి వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో తొలుత పలు అంశాలకు సంబంధించి పుస్తక పఠనం చేయించారు. ఇందుకు సంబంధించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఇందుకు అనుగుణంగా వ్యాసరచన పోటీలు జరిపారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు చిరుకానుకలను అందజేశారు.

కలిదిండిలో..

కలిదిండి: వినోదం, వికాసం, విజ్ఞానాన్ని అందిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు నింపుతాయని శాఖా గ్రంథాలయం అధికారి జె.రమేష్‌బాబు అన్నారు. కలిదిండి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖన పోటీలను బుధవారం నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు.



పామర్రులో స్కిప్పింగ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి

మండవల్లిలో..

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండవల్లి గ్రంథాలయంలో పర్వీన స్పాట్ డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేసవి సెలవుల్లో బాల బాలికల సందడికి నెలవుగా గ్రంథాలయాలు మారాయని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. బుధవారం అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన, ఆటల పోటీలను చేపట్టారు.



గుడివాడలో చెస్, క్యారమ్స్ పోటీల్లో చిన్నారులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



గుడ్లవల్లేరులో విద్యార్థులకు వేసవి తరగతులు

దేశ భద్రతలో యువత భాగస్వాములు కావాలి

గుడివాడ టౌన్: దేశ భద్రతలో యువత భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ సబ్యా సచ్‌దేశ్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో 16 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంప్‌ను ద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఇక్కడ తర్ఫీదు ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కళాశాలల నుంచి 207 మంది, 8 పాఠశాలల నుంచి 211 మంది బాల బాలికలు ఈ శిబిరంలో శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ శిబిరంలో భారత దేశ వాతావరణ పరిస్థితులు, వాటికి అనుకూలంగా విద్యార్థులు ఎలా మసులుకోవాలి, దేశ భద్రత కోసం ఏ మేరకు పనిచేయాలి, క్రమ శిక్షణ, బాధ్యత, దేశభక్తి, తుపాకి వాడకం, తుపాకి మరమ్మతులు, స్వయంగా నివాసాలు ఏర్పాటు తదితర అంశాలలో వీరికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శివనాథ్, క్యాంప్ కమాండర్ కల్నల్ సన్నార్‌సింగ్, ఎన్‌సీసీ అధికారి ఎండీ సలీమ్, బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

రానున్న రోజులన్నీ శుభపరిణామాలే



కైకలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రానున్న రోజులన్నీ వైఎస్సార్ సీపీకి శుభసూచికంగా నిలుస్తాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు డీఎన్నార్‌ను బుధవారం కలిసి ఆయా మండలాల్లో జరిగిన పోలింగ్ సరళిని వివరించారు. కచ్చితంగా మరో పర్యాయం వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహుని జయంత్యుత్సవం

కైకలూరు: వరహాపట్నం శ్రీభూ సమేత శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవం బుధవారం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహునికి వైఖానస ఆగమోక్తముగా శ్రీ నృసింహయాగం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రధానంగా లక్ష తులసి పూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధన పూజ, చతుర్థశ కలశ స్నపన కార్యక్రమాలను అర్చకులు బృందవనం ధన్వంతరీ ఆచార్యులు, గోపీకృష్ణమాచార్యులు, అగ్నిహోత్రం శ్రీమన్నారాయణచార్యులు నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్, సిబ్బంది రాంబాబు భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీలక్ష్మీనృసింహస్వామికి లక్షతులసి పూజ

కర్రసాములో విద్యార్థుల ప్రతిభ



కలిదిండి: కర్రసాములో కలిదిండి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ సానా వెంకట రామారావు బుధవారం తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో వరల్డ్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని విజ్ఞాన విహార ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో అంతర్జాతీయ కర్రసాము పోటీలు జరిగాయని పేర్కొన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన కె.నాగసాయి చంద్ర గణేష్, కట్ట హశ్వంత్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అదేవిధంగా సయ్యద్ హనీఫ్, కొండేటి భగవాన్ వెండి, కొండేటి సాయికృష్ణ, చంద్ర గణేష్ కంచు పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కర్రసాములో శిక్షణ ఇచ్చిన మధు బాబు, విజేతలను ప్రిన్సిపాల్ కె.జయ పాండు రంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజికల్, సుశీల్ మీడియా, వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 14వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాక్టర్ జయంతి చక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సునీల్, మల్లాది స్వాతి, భారతి, భాగ్యశ్రీ, రూపశ్రీ, తులసి, శివశర్మ, రాజ్ కిషోర్, దామోదర గణపతిరావు తదితరులు వేటూరి సినీ పాటలను మధురంగా ఆలపించారు. సుప్రీం కోర్టు న్యాయవాది వరప్రసాద్ మాట్లాడుతూ.. బహుముఖ ప్రతిభాశాలి వేటూరి సుందరరామ్మూర్తి అని అభివర్ణించారు. ఆయన సినీ గేయరచయిత మాత్రమే కాదని పలు గ్రంథాలను రచించారన్నారు. ఆయన 8 నంది పురస్కారాలు అందుకున్నారని శ్రీశ్రీ తర్వాత తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని తెలిపారు. సాహితీ సంస్థల ప్రతినిధులు పి.విజయలక్ష్మి, ప్రసూనా రామన్, వెంకాయమ్మ, బి.వీరభద్రరావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అతిథులు వేటూరి చిత్ర పటానికి నివాళులర్పించారు.



వేటూరి చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: ప్రశాంతంగా ఎన్నికలు జరిగిన విధంగానే ఓట్ల లెక్కింపు రోజున అందరూ సంయమనంతో మెలిగి శాంతి భద్రతలకు సహకరించాలని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం, తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వంటి పనులు చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణ సంచా కాల్చడం, ఇతర పార్టీ అభ్యర్థుల ఇళ్ల ముందు కవ్వింపు చర్యలకు పాల్పడంటం, సివిల్ తగాదాలను అడ్డుపెట్టుకుని రెండు వర్గాల మధ్య రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు బైక్‌ల సైలెన్సర్లు తీసి హంగామా చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ అందరూ సంయమనం పాటించాలని, ఫలితాల రోజున ఎలాంటి హడావిడి, రెచ్చగొట్టే పనులు చేయొద్దని డీఎస్పీ హితవు పలికారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు త్రినాథ్, నాగప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

నేడు మాధవస్వామి కల్యాణం



అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

గూడూరు: స్థానిక దేవి భూదేవి సమేత శ్రీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారిని అశ్వవాహనం ఎదుర్కోలు సన్నాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి మంగళహారతులు పట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ తెలిపారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

పామర్రు: స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైశాఖ మాసం సందర్భంగా ఆలయంలో శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వార్లను ఆలయ ముఖ మండపం వద్దకు తీసుకొచ్చారు. యాజ్ఞాక స్వామి ముత్తెవి మాధవ్‌కుమార్ మంత్రోచ్ఛరణలతో స్వామికి ఆహ్వానం పలికారు. మేళ తాళాలు, వేద మంత్రాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. రొంపిచర్ల లోకాంత రంగ ప్రసాద్, హేమలత దంపతులు, రొంపిచర్ల యోగ ఫణి లక్ష్మీనాథ్, మృదుల దంపతులు పీటలపై కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆర్ ప్రసాద్, ఆర్.గోపిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి, చెంచయ్య, రామకృష్ణారెడ్డి, ఆర్.కృష్ణవేణి, ఠాగూర్ శ్రీనివాస్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం

పామర్రు: వేణుగోపాలస్వామి ఆలయంలో శాంతి కల్యాణోత్సవం అనంతరం బుధవారం ఉదయం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, అర్చకుడు ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. వేణుగోపాలుని దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో తొలుత ఎదుర్కోల ఉత్సవం కోలాహలంగా సాగింది. అనంతరం ఆలయ కల్యాణ వేదికపై కొలువైన స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకుడు పీతాంబరం విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



తోట్లవల్లూరులో వేణుగోపాలుని కల్యాణోత్సవం

కృష్ణా మిల్క్‌యూనియన్ ఛైర్మన్‌కు అభినందనలు

పామర్రు: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక పాల శీతల కేంద్రం ఆవరణలో పామర్రు క్లస్టర్ పరిధిలోని సంఘ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం కేక్‌ను కట్ చేసి అభినందనలు తెలిపారు. జిల్లా పాలక వర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్లు గోళ్ల పూర్ణ మల్లికార్జునరావు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఫీడ్ కమిటీ సభ్యులు గంధం సుజాత, పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్లూరి దామోదర కృష్ణ గోపినాథ్, సూపర్‌వైజర్ కైలా రమేష్‌బాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఆ యూనియన్ డైరెక్టర్లు అర్జా నగేష్, వల్లభనేని బాబూరావు చేతుల మీదుగా కేక్‌ను కట్ చేసి తినిపించుకున్నారు. గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్ర మేనేజర్ తోట సత్యనారాయణ పాల్గొన్నారు.



కేక్‌కట్ చేసి అభినందనలు తెలియజేస్తున్న జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్లు



గుడ్లవల్లేరులో బాబూరావుకు కేక్ తినిపిస్తున్న నగేష్

సత్యనారాయణకు ఘన నివాళి

గుడివాడ టౌన్: కార్మిక వర్గం కోసం జీవితాంతం పనిచేసిన గొప్ప నాయకుడు పర్సా సత్యనారాయణ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 70మంది ఎమ్మెల్యేలు తమ పదవికి రాజీనామా చేశారని వారిలో సత్యనారాయణ ఒకరన్నారు. సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన సింగరేణి ఉద్యమంలో పార్టీపై నిషేధం ఉన్న సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసి కొత్తగూడెం వచ్చి ఉద్యమం కోసా పనిచేశారన్నారు. ఆయన జీవిత చరిత్రను సమాజం ఆదర్శంగా తీసుకుని సమాజ సంక్షేమానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పి. రజిని, గోపాల్, ఆదిలక్ష్మి, యెషయ్య, వీరమ్మ, ప్రభుదాసు, కేశవరావు, సమీర్, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

అన్నవరం-చిర్లపాలెం(మోపిదేవి): మారెమ్మ తల్లి ఉత్సవాల్లో బుధవారం సాయంత్రం నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. మండల పరిధిలోని వెంకటాపురం శివారు అన్నవరం-చిర్లపాలెం గ్రామంలో మారెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరిరోజు బుధవారం సాయంత్రంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఐదు సంవత్సరాలు ఒకసారి నిర్వహించే ఈ జాతర ఉత్సవాలు గ్రామంలో పెద్ద పండుగలా సాగింది. భక్తులు మారెమ్మ తల్లి, పోతురాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సామూహికంగా సమర్పించుకున్నారు. మేళతాళాలు, డప్పుకళాకారులు సందడి, కళాకారులు కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు.



అన్నవరం-చిర్లపాలెంలో కోలాట కళాకారుల సందడి

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: భూసారం పెంచేందుకు వీలుగా 2024 ఖరీఫ్ సీజన్‌కు గానూ పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ఆమె ప్రారంభించారు. జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏఓ భవాని వివరించారు. మండలంలోని ఆర్బీకేల్లో జీలుగ విత్తనాలు 154.60, జనుము విత్తనాలు 77, పిల్లి పెసర విత్తనాలు 55.88 క్వింటాళ్లు నిల్వ ఉంచినట్లు ఏఓ భవాని తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.



వీరవల్లి ఆర్బీకేలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ భవాని